ప్రజాశక్తి
బుధవారం 25 అక్టోబర్ 2023 5 అనంతపురం



ఉరవకొండ పోలీస్‌స్టేషన్ తనిఖీ



విలేకరులతో మాట్లాడుతున్న ఎఎస్పీ హనుమంతు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ హనుమంతు మంగళవారం సందర్శించారు. ఇందులో భాగంగా స్టేషన్ వెనుక భాగంలో ఉన్న ఆస్తులు, క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ పోలీస్‌స్టేషన్‌కి సంబంధించిన క్వార్టర్స్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, నూతన క్వార్టర్స్ నిర్మాణానికి వేలంపాటలు నిర్వహించినట్లు తెలిపారు. త్వరలోనే కొత్త క్వార్టర్స్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ రూరల్, అర్బన్ సిఐలు ప్రవీణ్‌కుమార్, హరినాథ్, ఎస్ఐ వెంకటస్వామి పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలుద్దాం



శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతి అందిస్తున్న హోంశాఖ మంత్రి వనత, డిజి రాజేంద్రనాథ్‌రెడ్డి
(పక్క చిత్రంలో మాట్లాడుతున్న హోం మంత్రి వనిత, డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి)

- నిజాయితీగా విధులు నిర్వహిస్తేనే గుర్తింపు
- ప్రజలకు ఎళ్లవేళలా అండగా నిలవాలి
- అనంతలో ప్రొబెషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సమాజంలో పోలీసులకు ఎంతో గుర్తింపు ఉందని, అలాంటి రంగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రజలకు అండగా నిలవాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనతి తెలియజేశారు. అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న 28 మంది ప్రొబెషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌ను సోమవారం నాడు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత, డిజిపి కెవి.రాజేంద్రనాథ్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలో డీఎస్పీల విధులు అత్యంత కీలకమైనవని చెప్పారు. ఒక వైపు ఉన్నతాధికారుల నిర్ణయాలను అమలు చేస్తూ, మరో వైపు క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది చేత సమర్థవంతంగా పనిచేయించాల్సిన బాధ్యత డీఎస్పీలపైన ఉంటుందన్నారు. పోలీసు విధుల్లోకి వెళ్తున్న వారంతా నిజాయితీగా, సమర్థవంతంగా బాధ్యతలను నిర్వహించాలని సూచించారు. డీఎస్పీ అంటే డికేటెడ్ సక్సెస్ ఫుల్ పోలీస్‌గా, డైనమిక్ అండ్ సెన్సిబుల్ పోలీస్‌గా పేరు తెచ్చుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో లా అండ్ ఆర్డర్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి మార్గనిర్దేశంలో పోలీస్ శాఖ పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ సమూలమైన మార్పులతో నేరాలను నియంత్రిస్తూ ప్రజలకు మంచి సేవలందించాలన్నారు. మహిళల భద్రత, రక్షణ కోసం దిశ పోలీస్ స్టేషన్లు, దిశ యాప్, ప్రత్యేక కోర్టులను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై నమోదైన కేసుల్లో 93.7 శాతం వారం రోజుల్లోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేసి నిందితులకు న్యాయ స్థానంలో శిక్షలు విధించడంతో భాదితులకు సత్వర న్యాయం లభించిందని తెలిపారు.

ప్రజలకు మేలు చేసేలా విధులు నిర్వహించాలి : డిజిపి

బాధ్యతలు చేపట్టిన డీఎస్పీలు ప్రజలు మేలు చేసేలా విధులు నిర్వహించాలని డిజిపి రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. అన్ని వర్గాలు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి అందర్నీ సమన్వయ పరుచుకుని చట్టపరంగా ముందుకు సాగాలన్నారు. పోలీసు ప్రవర్తన సరిగా లేకపోతే ప్రభుత్వం, పోలీసుశాఖ, కుటుంబాలకు చెడ్డ పేరు వస్తుందన్న విషయాన్ని ఎప్పుడూ గుర్తించుకోవాలన్నారు. ఒత్తిడికి లోనుకాకుండా సాఫీగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. న్యాయం కోరి వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించేలా చూడాలన్నారు. మహిళల సమస్యలపై మరింత చొరవచూపి వారికి అండగా నిలవాలన్నారు. సోషల్ మీడియా పోకడలను నియంత్రించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేశామన్నారు. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దష్టిపెట్టామన్నారు. అనంతరం శిక్షణ సమయంలో ఫైరింగ్, ఇండోర్, అవుట్ డోర్ విభాగాల్లో రాణించిన, ప్రతిభ కనపరిచిన ప్రొబేషనరీ డీఎస్పీలకు హోంశాఖా మంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పిటిసి ప్రిన్సిపాల్, ఐజిపి వెంకట్రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి, అనంతపురం ఉమ్మడి జిల్లాల ఎస్పీలు కేకేఎన్.అన్బురాజన్, ఎస్‌వి.మాధవరెడ్డి, తాడిపత్రి బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, కాపు రామచంద్రారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జెడ్పీ ఛైర్మన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీంతో పాటు ఉమ్మడి జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.





పండుగ రోజూ పోరాటం

- ఇళ్ల పట్టాల కోసం ఆగని పేదల ఆందోళన
- గుడిసెల్లోనే దసరా పండుగ
- భిన్నత్వంలో ఏకత్వం ఉట్టిపడేలా వేడుకలు
- చిలమత్తూరులో కొనసాగుతున్న పేదల భూపోరాటం



భూ స్వాధీన స్థలం వద్ద సహపంక్తి భోజనాలు చేస్తున్న హిందూ,ముస్లిం, క్రిస్టియన్లు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఇళ్ల పట్టాల కోసం చిలమత్తూరులో పేదలు చేస్తున్న భూ పోరాటం నిర్విరామంగా కొనసాగుతోంది. పండుగ రోజు కూడా ఆందోళనను ఆపకుండా భూ స్వాధీన స్థలంలోనే నిరసన చేపట్టారు. ఓ వైపు పండుగ, మరోవైపు పోరాటాన్ని కలిపి ఆందోళన నిర్వహించారు. భిన్నత్వంలో ఏకత్వం ఉట్టిపడేలా హిందూ, ముస్లిం, క్రిస్టియన్లు దసరా పండగును వారు గుడిసెలు వేసుకున్న స్థలంలోనే సోమవారం జరుపుకున్నారు. అక్కడే వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. చిన్నారులతో కలిసి ఆటపాటలు, నృత్యాలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలంలో ఇళ్ల స్థలాల కోసం కోడూరు పొలం సర్వేనెంబర్ 805లో గత 40 రోజులుగా పేదలు భూస్వాధీన పోరాటం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పోరాటాన్ని కొనసాగిస్తూ జగనన్న లేఅవుట్‌లో వేసుకున్న గుడిసెల్లోనే పేదలు దసరా పండుగ సంబరాలు చేసుకున్నారు. గుడిసెల ముందు ముగ్గులు వేసి తోరనాలు కట్టారు. తొలుత లేఅవుట్‌లో సిపిఎం జెండాను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలమత్తూరులో ఇళ్ల స్థలాల కోసం పేదలు చేస్తున్న పోరాటం జిల్లాకే ఆదర్శం అన్నారు. విజయదశమి అంటే రాక్షసులపై ప్రజల విజయమని, అలాంటి రోజున పోరాట స్ఫూర్తితో ఎర్రజెండాను ఎగరవేయడం అభినందనీయం అన్నారు. పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

భిన్నత్వంలో ఏకత్వం ఉట్టిపడేలా వనభోజనాలు

భారతీయ సంస్కృతి సంప్రదాయం భిన్నత్వంలో ఏకత్వం ఉట్టిపడేలా హిందూ ముస్లిం సోదరలు కులమతాలకు అతీతంగా అందరూ కలిసి భూస్వాధీన స్థలంలోనే వంటకాలు చేసుకుని, సహపంత్తి భోజనాలు చేశారు. న్యాయమైన పోరాటానికి కులమతాలు అడ్డురావని, అందరూ ఐక్యం ఉంటే ఎలాంటి లక్ష్యాన్ని సాధించవచ్చేని సంకేతాన్ని వారు అందించారు. పేదలు చేస్తున్న ఈ పోరాటం చాలా మందిని కదలించింది. మండలంలోనే పలు గ్రామాల ప్రజలు వారి వద్దకొచ్చి మద్దతు తెలిపారు. ఇక చిన్నారులు చేసిన నృత్యాలు అక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సమిష్టిజీవనం... సమిష్టి కృషితో ఇళ్ల పట్టాలు సాధిస్తాం
ఇళ్ల స్థలాల సాధన కమిటీ కార్యదర్శి చందు

సిమిష్టి జీవనం.. సమిష్టి కృషితో ఇళ్ల పట్టాలను సాధించేలా పోరాటం కొనసాగిస్తామని ఇళ్ల స్థలాల సాధన సమితి కార్యదర్శి చందు తెలిపారు. 805 సర్వే నెంబర్‌లో గుడిసెలు వేసుకున్న పేదలందరూ కష్టజీవులన్నారు. గుడిసెల కేంద్రంలో పండుగ వాతావరణం ఉట్టిపడేలా ఐక్యమత్యంగా పోరాటం సాగిస్తున్నామని చెప్పారు. ఈ వేడుకల ద్వారా తమ పోరాట స్ఫూర్తిని ప్రభుత్వం, అధికారులకు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా కార్యదర్శి పెద్దన్న, అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి.రమణ, సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, అధ్యక్షుడు లక్ష్మినారాయణ, చందు, సదాశివరెడ్డి, రహంతుల్లా, రియాజ్, వేణు, మణి, శివ తదితరులు పాల్గొన్నారు.



ఎండుతున్న పంట చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు కేశవరెడ్డి

వర్షాలు లేక ఎండుతున్న పైర్లు

ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల వ్యాప్తంగా ఒకటిన్నర నెల నుంచి వర్షాలు లేకపోవడంతో పత్తి, మొక్కజొన్న, వేరుశెనగ, ఆముదం, కంది తదితర పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలం వ్యాప్తంగా వేరుశెనగ 45 హెక్టార్‌లో సాగు చేశారు. పుట్లూరు, ఎల్లుట్ల గ్రామాల్లో ఎక్కువగా వేరుశనగ పంట సాగు చేశారు. ఆయా గ్రామాల్లోని పొలం బెట్ట నేల కావడంతో పాటు వర్షాలు లేకపోవడంతో పంటలు పూర్తిగా ఎండు దశకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పుట్లూరుకు చెందిన రైతు కేశవరెడ్డి మాట్లాడుతూ తనకున్న నాలుగున్నర ఎకరాల్లో రెండున్నర ఎకరా వేరుశెనగ వేశానన్నారు. దీంతో సుమారు రూ.40వేల వరకూ పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పంట ఊడలు దిగే సమయం కావడంతో భూమిలో తేమ శాతం లేకపోవడం వల్ల పంట దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

చంద్రబాబు శేష జీవితం జైలుకే పరిమితం

విప్ కాపు రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తన శేష జీవితం జైలుకే పరిమితం అవుతుందని విప్ కాపు రామచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. చంద్రబాబు జైలు నుంచి లేఖలు రాశారంటూ అబద్ధపు ఉత్తరాన్ని ఆయన తనయుడు పప్పునాయుడు మీడియాకు ఇచ్చారన్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఆమె నాన్న ఎన్టీఆర్‌ను చెప్పుతో కొట్టించినప్పుడు ఆమె ఇంటి నుంచి బయటకు రాలేదన్నారు. అంతేకాక కరోనా సమయంలో వేలాదిమంది చనిపోయినా బయటికి రాలేదన్నారు. అయితే చంద్రబాబు దోపిడీ చేసి దొంగగా అరెస్టు అయి జైల్లో ఉన్నప్పుడు ప్రజలు కనిపించారా.. అని ప్రశ్నించారు. ఇకపోతే రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు లేని హంగామా చేసి న్యాయం గెలుస్తుందని, నిజం గెలుస్తుందని మాట్లాడతున్నారన్నారు. రూ.371 కోట్ల సిమెన్స్ పేరిట అగ్రిమెంట్ చేసుకుని సంతకాలు చేసి, వాటిని తిరిగి పార్టీ ఖాతాలోకి జమ చేసుకున్న మాట వాస్తవం కాదా.. అని నిలదీశారు. కాలవ శ్రీనివాసులు పండగ రోజు కూడా సెల్ఫీ డబ్బా పెట్టుకుని 'ఇంకుడు గుంతలు, నీరు – చెట్టు, ఎలుక కొట్టు– వెయ్యి పట్టు, దోమలపై దండయాత్ర' పేరిట ప్రభుత్వ సొమ్ము దోచుకున్నది నిజం కాదా.. అన్నారు. ప్రజలను మభ్యపెట్టి మాట్లాడేందుకు కాలవకు సిగ్గుండాలన్నారు. ఆయా పథకాల పేర టిడిపి అవినీతికి పాల్పడితే.. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు–నేడు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, ఆరోగ్య కేంద్రాలు మొదలైన వాటికి ఖర్చుపెట్టి అభివృద్ధి పనులు నేడు తాము చేస్తున్నట్లు చెప్పారు. దొంగకు మద్దతుగా ప్రచారం చేస్తున్న మీరు కూడా దొంగ అన్నారు. చంద్రబాబుకు ఫైబర్ నెట్ ఒక్కటే కాక ఇంకా అనేక కేసుల్లో విచారణ జరిగి శేష జీవితం జైలుకే పరిమితమవుతుందన్నారు. ఇకపై కాలవ డ్రామాలు ఆడటం మానుకోవాలని, లేదంటే తాము కూడా కౌంటర్‌గా ఉద్యమిస్తామని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తెలుగు దొంగలకు బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు.



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీ రంగయ్య

వాల్మీకి జయంతి నిర్వహణకు ఏర్పాట్లు

పరిశీలించిన ఎంపీ తలారి రంగయ్య

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈనెల 28వ తేదీన అనంతపురం నిర్వహించే రాష్ట్ర స్థాయి వాల్మీకి జయంతి వేడుకలను ఎలాంటి సమస్యలు లేకుండా ఘనంగా నిర్వహించాలని ఎంపీ తలారి రంగయ్య అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి అనంతపురం నగరంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వద్దనున్న కెఎస్‌ఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో కార్యక్రమ నిర్వహణ కోసం స్థలాన్ని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన వాల్మీకి జయంతి రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లను త్వరగా అధికారులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీ ఎత్తున వాల్మీకులు హాజరు అవుతారన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అన్ని సౌకర్యాలూ కల్పించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. సాంప్రదాయ బద్ధంగా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. కార్యక్రమం నిర్వహించే స్థలం వద్ద శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ పొగాకు రామచంద్ర, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారీ, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

నిత్యం ప్రజల్లోనే ఉండాలి

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల వరకూ నిత్యం ప్రజల్లోనే ఉండాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని అర్బన్ పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జిలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలన్నారు. ముఖ్యంగా నగరంలో అనేక ఓట్లను తొలగించారని, వాటిని పరిశీలించాలన్నారు, దొంగ ఓట్లు నమోదు కాకుండా అప్రముత్తంగా ఉండాలన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు అంశాన్ని ఇంటింటికీ తీసుకెళ్లి ఇంటింటికి కరపత్రాలు అందించి అక్రమ అరెస్టు అంశాన్ని వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మారుతీకుమార్ గౌడ్, సాకే గంపన్న, దేవళ్ల మురళి, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, మార్కెట్ మహేష్, నటేష్ చౌదరి, సిమెంటు పోలన్న, దలవాయి వెంకటనారాయణ, గోపాల్‌గౌడ్, రంగాచారి, నెట్కాన్ చంద్ర, వన్నూర్, రాజారావు, బంగినాగ, గుర్రం నాగభూషణ, జెఎం.బాషా, పోతుల లక్ష్మీనరసింహులు, సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో సీజనల్ వ్యాధులు దూరం

మండల ప్రభుత్వ వైద్యులు ప్రవీణ్‌కుమార్, రవిశంకర్



ప్రజాశక్తి-నార్పల

అప్రమత్తతతో సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చని నార్పల, పప్పూరు ప్రాథమిక వైద్యశాలల వైద్యులు ప్రవీణ్‌కుమార్, రవిశంకర్ సూచించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉండాలన్నారు. ముఖ్యంగా రోజుల తరబడి నీరు నిల్వ ఉండడం వల్ల అపరిశుభ్రత నెలకొని దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయన్నారు. తద్వారా డెంగ్యూ, మలేరియా, మెదడువాపు, చికున్‌గున్యా వంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. ఈ సీజన్‌లో చాలామంది పలు వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. కావున జ్వరం వచ్చిన వెంటనే సొంత వైద్యం చేసుకోకుండా సమీపంలో ఉన్న వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలన్నారు. అయినప్పటికీ జ్వర ప్రభావం తగ్గకపోతే రక్త పరక్షలు చేయించి ఏ రకానికి చెందిన జ్వరం అన్న విషయాన్ని నిర్ధారించుకుని తగిన వైద్యం పొందాలని సూచించారు. వారం రోజుల నుంచి ఎండలు ఎక్కువగా ఉన్నాయని ప్రతి ఒక్కరూ నీరు బాగా తాగాలని. దీనికితోడు ఎక్కువగా పండ్ల రసాలు టెంకాయ నీరు కావాలని శరీరం ఎక్కువ అలిసిపోయి డిహైడ్రేషన్ కాకుండా తీసుకోవాలన్నారు. కాగా చెత్తాచెదారం, మురికి కాలువల్లో నీరు చేరకుండా చూసుకోవాలన్నారు. గుంతలు, మురికినీటి గుంతలను పూడ్చి నీరు నిలవ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాన్నారు. గ్రామాల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరగకుండా చూసుకోవాలన్నారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు. దోమలు రాకుండా చేసేందుకు మురికి కాలువల్లో నీరు నిల్వ ఉన్నచోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఇళ్లలోని కూలర్లు, పూలకుండీలు, పాత టైర్లు, సీసాలో ఎక్కువ రోజులు తరబడి మీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. రాత్రి సమయంలో దోమల నుంచి రక్షణగా దోమతెరలు వాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి



ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా వైద్యులు కృషి చేయాలని సిడబ్ల్యూసి మెంబర్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి సూచించారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఎదురుగా జమ్మలబండ గ్రామానికి చెందిన గురుదత్త కుమారుడు ఏర్పాటు చేసిన నూతన దంత చికిత్స కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తే గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, మాజీ ఎమ్మెల్యే వైటి.ప్రభాకర్ రెడ్డి, పబ్లిసిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకట రంగారెడ్డి, హనుమంత రెడ్డి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు

ప్రజాశక్తి-కుందుర్పి

వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం సత్వరమే ఆదుకోవాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని శ్రీమాజ్జనపల్లిలో ఎండుతున్న వేరుశనగ పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎకరా పొలంలో వేరుశనగ పంట సాగు చేయాలంటే కనిష్ఠంగా రూ.30 వేలు ఖర్చువుతుందన్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు పూర్తిగా ఎండుదశకు చేరుకున్నాయన్నారు. పంటలు దెబ్బతింటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గత టిడిపి హయాంలో వర్షాలు కురవకపోవడంతో రెయిన్ గన్‌లు అందజేసి పంటలు కాపాడామని గుర్తు చేశారు. ఆ దిశగా వైసిపి ప్రభుత్వం ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30వేలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనుంజయ, సత్తి, నాగరాజు, ఆనంద, గ్రామస్తులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎండుతున్న వేరుశనగ పంటను పరిశీలిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి ఉమా మహేశ్వరనాయుడు, నాయకులు

రాష్ట్రంలో రాక్షసపాలన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస పాలనను ఇంటికి సాగనంపే వరకూ ప్రజల్లోనే ఉండాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పిలుపునిచ్చారు. విజయ దశమి పండుగను పురస్కరించుకుని బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా అనంతపురం అర్బన్ పార్టీ కార్యాలయం వద్ద సైకో పోవాలి అని రాసిన పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవస్థలన్నిటినీ తన ఆధీనంలో ఉంచుకుని సిఎం జగన్ ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి రాక్షస పాలన పోవాలంటే వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మారుతీకుమార్‌గౌడ్, దేవళ మురళి, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, సుధాకర్‌యాదవ్, బంగి నాగ, వెంకటేష్, పూల బాషా, జెఎం బాషా, గోపాల్‌గౌడ్, దేవళ హరి, బొమ్మినేని శివ, డైమండ్ రఫీ, బోయపాటి బాలప్ప, వడ్డే మురళి, సున్నం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ అనంతపురం నియోజకవర్గంలోని రాజీవ్‌కాలనీ పంచాయతీలో మౌనదీక్ష చేసిన టిడిపి బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కసుమ చౌడయ్యకు సంఘీభావంగా టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, మైనార్టీ సెల్ నగర అధ్యక్షులు అజీజ్ వారి స్వగృహంలో సంఘీభావ దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పర్వదిన అయినప్పటికీ, చంద్రబాబు రిమాండ్ కారణంగా పండుగ చేసుకోకుండా, ఆయన చిత్రపటాన్ని పక్కన పెట్టుకుని మౌనదీక్ష చేపట్టినట్లు తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా టిడిపి అధికారం కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నారా భువనేశ్వరి చేపట్టిన "నిజం గెలవాలి" కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మహిళా లోకం తమ సంఘీభావాన్ని తెలపాలని పిలుపునిచ్చారు. నవంబర్ 1 నుంచి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నారా లోకేష్ ప్రారంభిస్తారని వివరించారు.


నార్పలలో 'సైకో పోవాలి' కరపత్రాలను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

'సైకో పోవాలి' కరపత్రాల దగ్ధంలో టిడిపి నాయకులు


అనంతపురంలో 'సైకో పోవాలి' కరపత్రాలను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

నార్పల: చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన 'దేశం చేస్తోంది రావణ దహనం.. మనం చేద్దాం జగనాసుర దహనం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి మండలంలోని బొందలవాడ గ్రామంలో సైకో పోవాలి అనే కరపత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు అవినీతి బురదలో నిండా మునిగిన జగన్ ఆ బురదను అందరికీ అంటించేందుకు పన్నిన కుట్రలో భాగమే స్కిల్ డెవలప్‌మెంట్ కేసు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెట్టు రంగారెడ్డి, ఎర్రినాగప్ప, లక్ష్మీనారాయణ, తలారి కుళ్లాయప్ప, పప్పూరు సత్తి, గుత్తానాయుడు, కమలాకర్, రవి, నరసన్న, తిరుపతయ్య, ధనుంజయ, వెంకటరాముడు, సుధా, శివారెడ్డి, నాగభూషణం, నాగేంద్ర, హనుమంతురెడ్డి, మారుతి, విజయ్, రామాంజి బొందలవాడ టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా శాంతినగర్‌లో ఉన్న జమ్మిచెట్టు వద్ద గల బన్నీ మహంకాళి ఆలయం, ఓబుళాచారి రోడ్డు, కోర్టు వద్ద, మారెమ్మ గుడి రోడ్డు వద్ద శమీవృక్షాల వద్ద ఉన్న మహంకాళి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి, చౌడేశ్వరి, వరలక్ష్మి, మహాలక్ష్మి, గద్వాల్ యల్లమ్మ, హాటకేశ్వరస్వామి ఆలయాల్లో పార్వతిదేవిని నిత్యం ఒక రూపంలో అలంకరించారు. దుర్గాదేవి పురాణ పటణం నిర్వహించారు. సోమవారం విజయదశమి పండుగ సందర్భంగా వేలాదిమంది భక్తులు అమ్మవారి ఆలయాలను దర్శించి పూజలు చేశారు. విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాలు శిల్ప, తదితర ప్రముఖులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పుట్లూరు : మండలంలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బాలాపురం గ్రామంలో కాళికాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తొమ్మిది రోజులపాటు పూజలు నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం చేశారు. మంగళవారం కాళికాదేవిని గ్రామమంతా ఊరేగించి పుట్లూరు చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అన్నదానం

మండలం కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నాడు, దాతల సహకారంతో అన్నదానం చేశారు. దసరా పండుగతోపాటు తొమ్మిది రోజుల అమ్మవారి ఉత్సవాలు సందర్భంగా ప్రతి సోమవారం అన్నదానం చేయాలని తీసుకున్న నిర్ణయం మేరకు



పుట్లూరులో అమ్మవారిని ఊరేస్తున్న భక్తులు

అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిఆపరు. ఈ కార్యక్రమంలో దాతలు బండిగారు రాజశేఖర్‌రెడ్డి, కె.రామచంద్రారెడ్డి, అర్.ఓబులేసు, కుందు శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : నియోజకవర్గవ్యాప్తంగా విజయదశమి పర్వదినాన్ని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా చివరి రోజు సోమవారం విజయదశమి పర్వదినం పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడయి. సాయంత్రం భక్తులు శమీవృక్షం (జిమ్మి చెట్టు) దర్శించుకుని పూజలను నిర్వహించారు. ఉరవకొండలోని నర్సమ్మ మఠం సమీపంలో ఉన్న శమీవృక్షాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల ఉత్సవ విగ్రహాలను మేళతాళల మధ్య శమీవృక్షం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు.


రాయదుర్గంలో అమ్మవారిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

టిడిపి నాయకులకు నోటీసులు


టిడిపి నాయకులకు నోటీసులు అందజేస్తున్న టిడిపి నాయకులు

గుత్తి : సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టరాదని హుకుం జారీ చేస్తూ టిడిపి నాయకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. టిడిపి నాయకులు ఎన్.కేశవనాయుడు, ఎంకె.చౌదరి, ఎస్ఎం.బాషా, దిల్కాశీనా, బర్డివలితోపాటు పలువురికి నోటీసులు ఇచ్చారు. తమ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా తాము శాంతియుతంగా నిరసనలు చేపడుతుంటే పోలీసులు ఇలా నోటీసులు ఇవ్వడం భావ్యం కాదన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామంలో దివాంగత విద్యా కమిటీ ఛైర్మన్ రంగనాయకులు జ్ఞాపకార్థం మంగళవారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను ఇచ్చారు. గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇలాంటి టోర్నమెంట్‌లు ఎంతో దోహదపడతాయని వైసిపి ఐటి విభాగపు జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అంజి, శివయ్య, రాజేష్, నరేష్, శివ రాయల్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

సిమెంటు రోడ్ల ప్రారంభం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని శాంతినగర్, జమ్మిచెట్టు వద్ద నిర్మించిన సిమెంట్ రోడ్లను విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన రూ.21.40 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లను నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మి చెట్టు వద్ద ఉన్న బన్నీ మహంకాళి ఆలయాన్ని నిత్యం ప్రజలు సందర్శిస్తుంటారన్నారు. అయితే అప్పటి పాలకులు రోడ్డును నిర్మించక నిర్లక్ష్యం చేయడంతో ఈరోడ్డు గతంలో కోతలకు గురై అపరిశుభ్రంగా ఉండేదన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు తాము ఆలయానికి మూడు వైపులా సిమెంట్ రోడ్డును నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షులు పోరాళు శిల్ప, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ వార్డు సభ్యులు గోవిందరాజులు, శారద, నాగవేణి, సంజీవప్ప, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నాగప్ప, వార్డు సభ్యులు రాము, వైసిపి పట్టణ అధ్యక్షుడు, 6వ శివప్ప, వైసిపి నాయకులు శివ, దివాకర్, సత్యనారాయణ, ఇస్మాయిల్, రిబ్కా, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో మినీ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-అనంతపురం

దసరా పండుగను పురస్కరించుకుని సంస్కృతి, సంప్రదాయాల సమాహారం శిల్పారామంలో ఈనెల 25 నుంచి మినీ ఎగ్జిబిషన్ కమ్ సేల్ ఖాదీ మహోత్సవ్-2023ను నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఖాదీని ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ తిరుపతిలోని డెవలప్‌మెంట్ కమిషనర్ హస్తకళలు, హస్తకళ సేవా కేంద్రం ఆధ్వర్యంలో అక్టోబర్ 25 నుంచి 31 వరకూ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన హస్తకళలు, చేనేత, ఖాదీ ఉత్పత్తుల అమ్మకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 7:30 గంటల వరకూ ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. అంతేకాకుండా పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియం చేసుకోవాలని కోరారు.


నృత్యం చేస్తున్న చిన్నారులు

పేకాట నియంత్రణకు చర్యలు శూన్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలవ్యాప్తంగా యథేచ్ఛగా పేకాట శిబిరాలు కొనసాగుతున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు, పోలీసులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అక్రమార్కులు సంపాదనే ధ్యేయంగా మండల కేంద్రంతోపాటు మండలవ్యాప్తంగా పెద్దఎత్తున పేకాట శిబిరాలు ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పేకాటరాయుళ్లు వచ్చి పగలూ, రాత్రి తేడా లేకుండా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గొరిదిండ్ల, సింగంపల్లి, వడ్డుపల్లి ఫారెస్ట్ ప్రాంతాల్లో పెద్దఎత్తున పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పేకాటను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

వృద్ధాశ్రమానికి మంచాల వితరణ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని కురగానపల్లి గ్రామంలో ఉన్న చెన్నకేశవ వృద్ధాశ్రమానికి నార్పల ప్రభుత్వ బాలల పాఠశాలలో 1997వ సంవత్సరం పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మంచాలను వితరణ చేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు స్రవంతి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గతవారం తమ బ్యాచ్ విద్యార్థులు చదువుకున్న పాఠశాల ఆవరణలో ఆత్మీయ కలయిక సందర్భంగా చేతనైనంత డబ్బులు వేసుకుని అనాథలు, నిస్సహాయులకు సాయం చేయడంతోపాటు తమతో పాటు కలిసి చదువుకుని ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న మిత్రులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే వృద్ధాశ్రమానికి నాలుగు ఇనుప మంచాలను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు షేర్‌ఖాన్, ప్రకాష్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మీపతి, రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మంచాలను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుత్తి : కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందాడు. ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. జి. ఎర్రగుడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆంజనేయులు, సురేంద్ర(10)తో కలిసి టమోటా బాక్సులు తేవడానికి తోట వద్దకు వెళ్లారు. టమోటా బాక్సులను ఆటోలో పెట్టుకుని స్వగ్రామానికి బయలుదేరారు. వేగంగా వస్తున్న ఆటో రహదారిపై మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆంజనేయులు, సురేంద్రను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురంకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో సురేంద్ర మరణించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జామ తోట దగ్ధం

రూ.20 లక్షలకుపైగా నష్టం


అగ్నికి ఆహుతయిన జామతోట

బెలుగుప్ప : ప్రమాదవశాస్తూ 13 ఎకరాల సాగు చేసిన జామ తోట అగ్నికి ఆహుతైన ఘటన మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధిత రైతు హనుమంతరాయుడు వివరాల మేరకు.. తనకున్న 13 ఎకరాల్లో రూ.లక్షలు వెచ్చించి తేవాన్ రకం జామ పంట సాగు చేసినట్లు తెలిపారు. దాదాపు మూడు సంవత్సరాలుగా జామ మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తుండగా ప్రస్తుతం కోతల సమయంలో ఉందన్నారు. ఈసమయంలో ప్రమాదవశాత్తు అగ్నిక ఆహుతై దాదాపు రూ.20 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు.

అనాథలకు అన్నదానం

ఉరవకొండ : యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అనాథలకు అన్నదానం చేశారు. ముందుగా మండలంలోని వెలిగొండ గ్రామంలో పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు థియేటర్లలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అనాథలకు అన్నదానంతోపాటు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ కర్రి ప్రసాద్, చేకూరి కన్నరాజు, వేగి సాయి, గైపూరి ప్రసాద్, గుర్రం ఈశ్వరరావు, చింతల గణ, ధరణేశ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రభాస్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అభిమానులు

గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలి


రౌడీషీటర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్‌చంద్ర

పెద్దపప్పూరు : గ్రామాల్లోని ప్రజలు గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ శరత్‌చంద్ర సూచించారు. మండలం పరిధిలోని పలు గ్రామాల్లోని రౌడీషీటర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా సమస్యలు సృష్టిస్తే అణిచివేస్తామన్నారు. చట్టపైన చర్యలు తీసుకోవడమే కాకుండా శిక్ష పడే విధంగా చేస్తామన్నారు. సమస్యలకు జోలికి పోకుండా మీరు, మీ గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మీ పిల్లల భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దాలంటే మీరు సమస్యల జోలికి వెళ్లకూడదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌బ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వైఎస్ఆర్ బీమా

రాయదుర్గం : పట్టణంలోని 28వ ఎన్నికల వార్డులో మంచివిష్ణు (45) అనారోగ్య కారణాలతో మృతిచెందడంతో భార్యకు వైఎస్ఆర్ బీమా కింద మంజూరైన చెక్కును మంగళవారం అందజేశారు. కాగా విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్‌పర్సన్ కాపు భారతి మృతుని భార్య, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పోరాళ్ల గోవిందరాజులు, వార్డు సభ్యులు ఫక్రుద్దీన్, వైసిపి నాయకులు, నిజాముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


బీమా అందజేస్తున్న నాయకులు, అధికారులు

జిల్లాకు చేరిన 3,200 మెట్రిక్ టన్నుల యూరియా


యూరియాను పరిశీలిస్తున్న ఎడిఎ ఎం.రవి

అనంతపురం : 3,200 మెట్రిక్ టన్నుల కోరమాండల్ కంపెనీకి చెందిన యూరియా మంగళవారం జిల్లాలోని ప్రసన్నాయిపల్లి రేక్ పాయింట్ చేరినట్లు అనంతపురం వ్యవసాయ డివిజన్ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రవి తెలిపారు. వీటిని పరిశీలించి కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారిణి దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు సహకార సొసైటీలు, ప్రయివేటు ఎరువుల డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఫర్టిలైజర్ కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పెద్దవడుగూరులో 'జగనన్నకు చెబుదాం'

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులో బుధవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ నాగభూషణం, ఎంపిడిఒ కుల్లాయిస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంలో ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా పెద్దవడుగూరులో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దవడుగూరులోని టిటిడి కళ్యాణ మండపంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గ్రామంలో కరణం కుటుంబం ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించిన 'చియ్యేడు బళ్లారి దుర్గమ్మ దసరా క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-1' విజేతగా బ్యాంకు బ్లాస్టర్స్ టీం నిలిచింది. తగ్గులేరు టీం రన్నర్స్‌గా నిలిచింది. ఈమేరకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఛైర్మన్లు, డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

మార్పు కోసం అడుగు..

భగత్‌సింగ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు - నేటి యువతకు ఆదర్శం భూదేటి చంద్రమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పుట్టటం కాదు.. పరుల కోసం బతకటం నిజమైన పుట్టుక అని 'నవ యువ భారత్ ఛారిటబుల్ ట్రస్టు' అధినేత భూదేటి చంద్రమొహన్‌రెడ్డి అన్నారు. అతి చిన్న వయసు నుంచి చంద్రమొహన్ చేస్తున్న సామాజిక సేవలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. తన సంకల్పానికి, సామాజిక దృక్పథానికి మిత్రులు, కుటుంబ సభ్యుల తోడ్పాటు తోడుకావడంతో ఆయనలో మరింత ఉత్సాహం, బాధ్యతలు పెరిగినట్లు చెబుతున్నారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలోని తోపుదుర్తిలో జన్మించిన చంద్రమొహన్‌రెడ్డి తండ్రి రామకృష్ణారెడ్డి ప్రోద్బలం.. సిఆర్‌పిఎఫ్ జవానన్లు అయిన తన మేనమామలు రామనాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని సమాజానికి తనవంతు సాయం అందించాలని సామాజిక కార్యక్రమాల వైపు అడుగులు వేశారు. డిగ్రీ చదువుతున్న సమయంలోనే విద్యార్థులకు సమాజిక అవగాహన, పకృతిని కాపాడటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ పలువురితో ప్రశంసలు అందుకున్నారు. పుట్టిన జిల్లాలోని ప్రజలకు తన వంతు సేవ చేయాలనే సంకల్పంతో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఉన్నత చదువులు చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం లభించినా అతనిలోని సామాజిక కోణం, దృఢసంకల్పం కుంటుపడలేదు. దేశ సామాజిక భద్రతలో వెనుచూపని ధీరుడు, స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక భూమిక పోషించిన భగత్‌సింగ్ ఆశయాలను అవపాశన పట్టిన చంద్రమొహన్ ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేశానన్నారు. గతంలో ఎస్పీగా పనిచేసిన స్టీఫెన్ రవీంద్రను ఆదర్శంగా తీసుకుని 2009 జనవరి 12 న వివేకానంద జయంతి రోజున నవయుగ భారత్ ఛారిటబుల్ ట్రస్టును 80 మంది సభ్యుల భాగస్వామ్యంతో ప్రారంభించారు. వీరికి వచ్చే వేతనాల్లో కొంత భాగాన్ని నేటి వరకూ సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ఇదే క్రమంలో 2017 జూలై 3న నవ యువ భారత్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. నవ యువ భారత్ వేదికగా విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడంతోపాటుగా రక్తనిర్ధారణ పరీక్షలు, బ్లడ్ క్యాంపులు, ఉచిత మెడికల్ క్యాంపులతోపాటు అనేక చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పలు స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీలు, మౌలిక వసతులు కల్పన, పేద విద్యార్థులకు చదువుకోసం చేయూతనందిస్తున్నట్లు తెలిపారు. తాము చేస్తున్న కారక్రమాలను మాజీ సిబిఐ అధికారి జేడీ లక్ష్మీనారాయణ, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్‌నారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి పలువురు ముఖ్య నాయకులు, నేతలు అభినందించారన్నారు. ప్రధానంగా ప్రధానమంత్రికి మాస్ ఫ్లాగ్ యాస్టింగ్ కోసం విద్యార్థుల్లో చైతన్యం కల్పించే దిశలో లక్ష పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టినట్లు చెప్పారు. దేశ భక్తిని మరింత విస్తృత పరిచేందుకు ఈ కారక్రమం దోహదపడుతుందన్నారు. తాము ట్రస్టు ద్వారా అనంతపురం రూరల్ ప్రాంతాలైన సిండికేట్ నగర్, రుద్రంపేట, తపోవనం, తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటుకు చేయూత నిచ్చినట్లు చెప్పారు. విలువతో కూడిన విద్య, ఉపాధి లక్ష్యంగా సిఎంఆర్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌ను ప్రారంభించినట్లు వివరించారు. ఐటి రంగంలో ఉపాధి కల్పనకు ఆధారంగా నాణ్యమైన విద్య, ఉపాధి లక్ష్యంగా రెండేళ్లలో 20 మందికిపైగా ఉద్యోగాలను అందించినట్లు చెప్పారు. అనేక అవగాహన కార్యక్రమాల ద్వారా సాఫ్ట్‌వేర్ వుద్యోగులకు ఉపాధి అవకాశాలమార్గాలను చూపుతున్నామన్నారు. ప్రస్తుతం రాప్తాడు ఎమ్మెల్యే తోపుతుర్తి ప్రకాష్‌రెడ్డి తనలోని సామాజిక దృక్పథం ఐటి రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఆ నియోజకవర్గ ఐటి వింగ్ అధ్యక్షులుగా అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆయన నేతృత్వంలో ఐటి వింగ్ ద్వారా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని యువతకు చేయూతనిచ్చే కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఐటి టెక్ పార్కులను తీసుకురావటానికి కృషి, ఇంకుబేషిన్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి ఉన్న అవకాశాలను వివరించే కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు.



సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న భూదేటి చంద్రమోహన్‌రెడ్డి



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో భూదేటి చంద్రమోహన్‌రెడ్డి